K. Pulla Reddy

# ప్రతిఫలం

“దొరగారొస్తారు. పని పూర్తి కావాలి. కాక పోతే ప్రసిడెంటుబాబుగారికి మాటొస్తుంది.”

అదీ-ఆకూలివాడి ఆరిపోయే గొంతుకలో నించి, శరవేగానవచ్చి, ఎండిపోయిన రెండు పెదవులమధ్య నలుగుడుపడుతోన్న ఆ ‘ఆరాటం’.

‘ఎందుకబ్బా? అంతగా-’

“సోమిగాడు పోటీకి రాకపోయినట్టయితే పావలా యిచ్చేవారు. ఐనా ఆడడిగిన మూడణాలకే పని నాకేయిచ్చారు. దయగల్ల తండ్రులు-”

‘అందుకూ ఆ కృతజ్ఞత’

ఒక్క ఆకైనా కదలాడడం లేదు. ఎండ నిప్పులు చెరుగుతోంది. కరిగే కండలు కారే చెమటల్లో పాక్కిపోతున్నాయ్.

‘ఒక్కడనే పలుగువేయడం, మన్నుతీయడం-యిబ్బడి చాకిరీ అయింది. కూలికి మించినపని.’

‘ఏమో!- దాని కొప్పుకోకపోతే!’

‘చేతులు ముడుచుకుని యింటికాడకూచుని మాత్రం చేసేదేముందిలే. పిల్లాడికి పుస్తుకన్నావస్తది.”

'అదీ నిజమే. పేదసంసారం'

'ఉశ్!అబ్బా!! నరాలు చేదుకుపోతున్నాయ్. పని పూర్తయ్యేట్టు లేదే?'

'ఏమబ్బా! అలా రెక్కలు ముక్కల్జేసుకోక పోతే. రోజల్లా పని చేయడమేగా? ధర్మం.'

''బాబుగారు నన్ను నమ్మి యీపని పురమాయించారు. యీ కాస్తదానికి రెక్కల్దాచుకుని పాపం కట్టుకునేదా? యిల్లానే నిలబడి యింకో పూపు పూపితే–''

మూడు గంటలయింది.

''నాలుక పిడచగట్టుకుపోతోంది. దాహం. దగ్గర్లోనే చెరువు. పూపిరుండగానే అక్కడకు చేరుకుంటే ఎవరో ఒకరు యిన్ని నీళ్ళు పొయ్యకపోతారా?''

—దారికి ప్రక్కగా చెరువుకట్టక్రింద నుంచున్నాడు. బిందె బుజానపెట్టుకుని ఓ నల్భైయేళ్ళ విధవావిడ—.

''అమ్మగారూ! అమ్మగారు!!'' కూచోని దోసిలి బట్టాడు.

''ఓరి మాలముండాకొడకా'' బిందెడునీళ్ళూ క్రింద గుమ్మరించి తిరిగీ చెరువుకు పోయిందావిడ.

నోట మాట రావడంలేదు. వాచారబట్టి సంజ్ఞచేస్తున్నాడు.

ఒకరు—యింకొకరు — మరొకరు — వరుసగా వస్తున్నారు. పోతున్నారు. అంతే—

యిాడిగిలబడి పోయాడు.

దారినే గొడ్లతోలుకుపోతున్న రెడ్లకుర్రాడు గబగబాపోయి పైనున్న పంచె చెర్లోతడిపి తెచ్చాడు. తల తొడమీాద పెట్టుకుని నోట్లో యిన్ని నీళ్లు పిండాడు. అందుకు—కోమిటోరి మంగమ్మ చేతులు ఝాడిస్తూ, ఆ కుర్రాడి దీపమే ఆర్పిందా? కుదురే కూల్చిందా, వైనవైనాలుగా—అబ్బో!

—బాగా తెలివి వచ్చింది. ప్రొద్దువంక చూచాడు.

"అమ్మయ్యో! దొరగారువచ్చే వేళయింది. ప్రొద్దు వాటాలింది. బాబుగార్ని ముంచేశానే—"

కాళ్ళీడ్చుకుంటూపోయి పని మొదలెట్టాడు. తత్తరపడుతున్నాడు. ఆ తొందర్లో పలుగు కాలిమీాద వేసుకున్నాడు. రక్తం వరదలైపోతోంది. తలగుడ్డచించి కాలికి చుడుతున్నాడు.

"బాబుగారి పనికన్నీ అంతరాయాలే కల్పిస్తున్నాడే! పాడుదేవుడు. నామూాలాన్న బాబుగారికి మాటొచ్చే రోజొచ్చింది. సోమిగాడే ఐతే పనిపూర్తి అయ్యేదేమో?!"

"ఏం మామా! పని పూర్తయినట్టే వుందే? ప్రసిడెంటుగారి తిక్క వొదిలించావులే." అని వెటకారం చేశాడు. దారేపోతూ సోమిగాడు.

"ఆ! ఎంతమాట" గుండెలలోనుంచి కరుకుక్కున దూసుకుపోయింది.

ఆదార్నే గురవడు పోతున్నాడు.

"ఒరే గురవన్నా! ఓ అణాడబ్బులిచ్చుకుంటాను. యిది కాస్త తవ్విపెడుదూ. దొరగారొచ్చేస్తుండాలీ—"

గురవన్న పలుగేస్తున్నాడు. ఆ ఊడిపోయే కట్టుగుడ్డతో కారే రక్తాన్ని మూటగట్టుకుంటూ మట్టి తీస్తున్నాడు.

పనిపూర్తయింది. యింకో అరగంట ప్రొద్దుంది.

'టక్-టక్-టక్-' బూటు చప్పుడుతో కళ్లజోడు తుడుచుకుంటూ ప్రసిడెంటుగారు వొస్తున్నారు.

"బాబుగారు! పని పూర్తయింది." అన్నాడు ఎదురుబోయి మొగం చాటంత చేసుకొని—

"భేష్! మంచివాడివి. నీ కెంతిచ్చినా దండుగ లేదు." అన్నాడు ప్రసిడెంటు లాల్చీ జేబులోంచి శేప్ బయటికి తీస్తూ.

'బాబా ! చుక్కికి చిన్నబిడ్డనొప్పి వొచ్చిందట అమ్మొరమ్మంది.' అన్నది కూతురు.

"బాబుగారూ! వెళ్తాను" అని దణ్ణంపెట్టాడు.

"దొరగారొచ్చేస్తున్నారు. ఐపోయింది. వెళ్లు దూగాని"

"బాబుగారు ! పిల్లకి-"

"ఏం పర్వాలేదు"

"ఇంట్లో మీా జీతగత్తె ఒకటేనండి. దాని కేవిాం తెలవదు."

"పక్కవాళ్లొచ్చి చూస్తారులే"

ఆధోరణికి నిర్ఘాంతపోయాడు. కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

"బాబుగారూ—! వెల్తానండీ—!"

"వెళ్తావూ? బాగానేవుంది. ఏదైనా మళ్ళీ సరిచెయ్యాలంటే అందుకు మళ్ళీ యింకో కూలీనా? దొరగారొచ్చిం తర్వాత—"

"మీా పాదాలకాడ బతికేవోణ్ణి. పనికూడా సొంతంజేసాను. కనికరించండిబాబు.!"

"వీల్లేదు. ఇది రోజుకూలీగాని, కంట్రాక్టు పనికాదు."

''కాంట్రాక్టుపని కాదు.'' అతడిహృదయం జలదరించిపోయింది. ఆమాటనే తిరిగి అనుకున్నాడు. 'కాదా' అని సందేహం.

''ఔను, ధర్మమే, కంట్రాక్టుపనికాదు''— తనలోతానే సమాధానం—

''ఇప్పుడే వస్తాదొరా! ఒక్కసారి—''

''చెబుతోంటే ఆగడంగావుంది, అవసరమైతే నీతాతగాడెవడున్నాడిక్కడ— పోయావో- నీకు చిల్లి దమ్మిడీరాదు.''

'చిల్లిదమ్మిడీ రాదు' ప్రొద్దుట్నుంచీ ఎంతో కృతజ్ఞతతో - మాటకోసం - ఒంటరిగాడైకూడా చేసిన ఇబ్బడి చాకిరీకి ఫలం — 'పోయావో చిల్లిదమ్మిడీరాదు' పోకపోతే - జబ్బుచేసినపిల్లను పెట్టుకుని - ఒంటరిగా కాకిగోలగా ఏడ్చే అమాయికురాలుపెళ్ళాం— చుట్టూ ఏమీ తెలియక గగ్గోలుపెట్టే పసికూనలు- పొరుగువాళ్లు మాత్రం అప్పుడే పనిలోంచి రావచ్చారా—?

అదీ—ఇదీ అతని హృదయాన్ని వంతులు వేసుకుని బాధిస్తున్నాయి. 'పోయావో— చిల్లిదమ్మిడీరాదు!'

ఆ రాత్రి కా సంసారం ఉపవాసాలు చెల్లించాల్సిందేనా? గడచిన దినాల బాధలు పుర్రెలో తిరుగుతున్నాయ్.

"బాబా!" అని పిల్ల చెయ్యి పట్టుకుని లాగుతోంది.

అంతలో మళ్ళీ పిల్లను గురించిన – ఆవేదన–

"మూణ్ణాల కూలీకోసరం పిల్లను వదిలెట్టుకోనా? ఎంత కటికగుండైనా—" మాట్లాడకుండావంగి, తన కాలి నెత్తురు రుచిచూచిన పలుగుని బుజాన నెత్తుకుని గబగబా నడిచాడు.

పోయేవాడివంక చురచురాచూస్తూ తల వూపాడు ప్రెసిడెంటు.

యింతకూ ఆవేళ దొరగారు తనిఖీకీ రానూలేదు; రోజల్లా కష్టపడ్డా కూలీ ముట్టనూలేదు.

గురవడుమాత్రం అణాకోసం గుడిసెముందు రోజుకు ము–మ్మారు.

---